
# 11 వొంకాయంత వొజ్రం

అనంగనంగ వుల్లిగడ్డంత వూరుండేటిది. ఆ వూల్లె శింతకాయంత శిట్టోడు వుండేటోడు. ఆడొగనాడు రోడ్ మీదికెల్లిపోతుంటె తొవ్వల ఓ కాడ వొంకాయంత వొజ్రం దొర్కింది. ఆ వొజ్రాన్ని యేడ దాశిపెట్టాల్నా అని శానసేపు ఆలోచించిండు. ఆలోశించంగ ఆలోశించంగ టక్కున మునక్కాయంత ముసలమ్మ యాదికొచ్చింది. గామె కాడ దాశి పెడ్తె బద్రంగ వుంటదనుకుండు. యెంబడే ఆమెతానికివొయ్యి ఆ వొజ్రాన్ని యిచ్చిండు. ముసలమ్మ ఆల్ల యింట్లవున్న బీరకాయంత బీరువల వొజ్రాన్ని దాశిపెట్టింది. దానికి తాటికాయంత తాలమేశింది.



అది దొండకాయంత దొంగోడు గనిపెట్టిండు. యెట్లనన్న ఆ వొజ్రాన్ని యెత్కపోవాలనుకుండు. కాపు గాస్కోని గూసుండు. ఒగనాడు ముసలమ్మ యేదో పని మీద బైటికివొయ్యింది. గదే మంచి టైమనుకొని దొంగోడు యింట్లకు జొరవడ్డడు. గడ్డపోసంత గడ్డపారతోటి తాలాన్ని పలగొట్టి బీరువల వున్న వొజ్రాన్ని యెత్కపొయ్యిండు. ముసలమ్మ యింటికొచ్చి జరిగింది జూశి లబ్బలబ్బ మొత్కుంది. శిట్టోనికి సంగతంత జెప్పింది.

ఆల్లిద్దరువొయ్యి పొట్లకాయంత పోలీసుకు ముచ్చటంత జెప్పిర్రు. అయిన జీడిపప్పంత జీపులవొయ్యి దొంగోన్ని వట్కొచ్చిండు. ఆన్ని జామకాయంత జేల్ల యేశి లవంగమంత లాటీతోటి గొట్టిండు. గాదెబ్బలకు తట్టుకోలేక దొంగోడు వొజ్రాన్ని యిచ్చేశిండు. పోలీసు వొజ్రాన్ని శిట్టోని శేతిలవెట్టి యిగనన్న బద్రంగ దాస్కోమ్మన్నడు. శిట్టోడు, ముసలమ్మ సంతోషంగ పోలీసుకు దండం బెట్టి యెల్లిపొయ్యిర్రు.

**అ. చదవండి–చెప్పండి–రాయండి.**

1. శిట్టోడికి ఏమి దొరికింది?
2. ముసలమ్మ వజ్రాన్ని ఎక్కడ దాచింది?
3. దొంగోడు వజ్రాన్ని ఎట్లా ఎత్తుకుపోయాడు?

**ఆ. జతపరచండి:**

| | | | |
|---|---|---|---|
| 1. | మునక్కాయంత | – | (అ) జీపు |
| 2. | పొట్లకాయంత | – | (ఆ) తాళం |
| 3. | జీడి పప్పంత | – | (ఇ) ముసలమ్మ |
| 4. | తాటికాయంత | – | (ఈ) పోలీసు |